నవతెలంగాణ
ఆదిలాబాద్
1
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

ఎన్నికల నియమావళి అమలుపై అధికారుల దృష్టి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నియమావళి అమలుపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 48 గంటల్లో బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఫ్లెక్సీలు తొలగించాలని నిబంధన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలను తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.



బీజేపీ, బీఆర్ఎస్‌లను తరిమికొట్టాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫాసిస్టు విధానాలను అవలంబిస్తున్న బీజేపీ దానికి సహకరిస్తున్న బీఆర్ఎస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని సీపీఐ(మావోయిస్టు) మంచిర్యాల డివిజన్ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామిక, పౌర సంఘాల నాయకులతో పాటు సమాజాన్ని చైతన్య పరిచే విలేకరులపై కూడా అక్రమంగా కేసులు పెట్టారని తెలిపారు. నిర్బంధం, ఫాసిస్టు, పోలీసుల రాజ్యాన్ని అవలంబిస్తున్న రెండు పార్టీలను కార్మిక, కర్షక, యువజన, విద్యార్థి, మేధావి వర్గాల ప్రజలు తిరస్కరించాలని పేర్కొన్నారు. ఉపా కేసులు పెట్టి జైల్లో బంధించిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేయాలని, ప్రజాస్వామిక గొంతుకలను కాపాడాలని కోరారు.

మళ్లీ మున్సిపల్ కార్మికుల సమ్మె

- సమ్మె చేస్తే కాని వేతనాలు ఇవ్వలేని పరిస్థితి
- ఇదీ కాగజ్‌నగర్ మున్సిపాలిటీ సిత్రం

కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మళ్లీ సమ్మె చేపట్టారు. మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. చెల్లించే అరకొర వేతనాలను సక్రమంగా చెల్లించకపోవడం, నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో ఆ కార్మికుల కుటుంబాల పోషణ కష్టసాధ్యంగా మారింది. దీంతో ప్రతి నాలుగైదు నెలలకోసారి కార్మికులు సమ్మె చేపడితే కాని వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రస్తుతం నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. ఈ ఏడాది జులై నుండి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈఎస్ఐ, పీఎఫ్ కూడా ఆయా ఖాతాలలో జమ చేయడం లేదు. దీంతో ఈఎస్ఐలో ఉచిత వైద్య సదుపాయానికి కూడా వారు నోచుకోవడం లేదు. తమకు వేతనాలు చెల్లించాలని కార్మికులు సోమవారం కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. దీనికి ముందు గత నెల 30న తాము సమ్మె చేపడతామని కార్యాలయంలో సమ్మె నోటీసు కూడా అందించారు. అయినా స్పందన లేకపోవడంతో మంగళవారం నుండి సమ్మెకు దిగారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో ఉదయం విధులకు వెళ్లకుండా మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, సంజీవ్ మాట్లాడుతూ ఎప్పుడు సమ్మె చేసినా ఛైర్మన్, కమిషనర్ హామీలిస్తూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అన్నారు. కొన్నేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాలలో జమ చేయడం లేదని, నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని అన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు శంకరమ్మ, మల్లేష్, రమేశ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్ల పీఎఫ్, రూ.40 లక్షల ఈఎస్ఐ బకాయిలు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు పీఎఫ్ కింద మున్సిపాలిటీ రూ.1.50కోట్లను, ఈఎస్ఐ కింద రూ.40 లక్షలను ఆయా ఖాతాలలో జమ చేయాల్సి ఉంది. పీఎఫ్ కింద కోత విధించిన మొత్తం కార్మికులు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కార్మికులకు చెల్లించాల్సి ఉంటుంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు 134(పర్మినెంట్ 125, ఎన్ఎంఆర్ 9) మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.16,600 వేతనం చెల్లిస్తారు. ఇందులో నుండి పీఎఫ్, ఈఎస్ఐ కింద రూ. 2000 కోత విధించి రూ.14,600 చెల్లిస్తారు. కోత విధించిన రూ.2000కు మున్సిపాలిటీ మరో రూ. 2000 కలిపి మొత్తం రూ. 4 వేలను ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాలలో జమ చేయాల్సి ఉంటుంది. వీరితో పాటు వాటర్ సప్లై, ఎలక్ట్రిసిటీ విభాగాలలో మరో 35 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిది కూడా ఇదే పరిస్థితి. గత మే నెలలో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేయగా జూన్ పదో తేదీ వరకు ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాన్ని చెల్లిస్తామని అప్పట్లో మున్సిపల్ ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటి వరకు నెరవేరలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేపడుతున్న పారిశుధ్య కార్మికులు



గత నెలలో సమ్మె నోటీస్ అందిస్తున్న కార్మికులు (ఫైల్)

చెగువేరా యువతకు స్ఫూర్తిదాయకం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నాయకులు చెగువేరా యువతకు ఒక స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వసాకె సాయికుమార్ అన్నాడు. చెగువేరా 56వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ క్యూబా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన వ్యక్తి చేగువేరా అన్నారు. తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి ఉద్యమాలు చేపట్టి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సుంకరి సాయికృష్ణ, దిగిడ ప్రకాష్, నాయకులు కార్తీక్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానిక ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ శిబిరంలో 21 మందికి పరీక్షలు నిర్వహించగా, ఇందులో 13 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉమ్మడి జిల్లా అండర్-19 కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 12న గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో అండర్-19 కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడల ప్రధాన కార్యదర్శి బాబురావు, డీఐఈఓ శంకర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఉదయం 12 గంటల లోపు ధృవీకరణ పత్రాలతో కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరములకు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాబురావు నెంబర్ 9849922445ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అమిత్‌షా బహిరంగ సభకు బయలుదేరిన శ్రేణులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్‌లో నిర్వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ సభకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ నేతృత్వంలో శ్రేణులు తరలివెళ్లారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అనేక నిధులు మంజూరు చేసిందన్నారు. తాజాగా గిరిజన యూనివర్సిటీతో పాటు పసుపు బోర్డు ఏర్పాటుకు కూడా నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేర్ల మురళీధర్, నాయకులు బాలకృష్ణ, రమేష్ గౌడ్, సోము, తిరుపతి, వెంకటేష్, రమేష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

జిల్లా సమస్యలు ప్రస్తావించని అమిత్‌షా..!

- సీసీఐ, రైల్వేమార్గం, విమానాశ్రయంపై స్పందన కరువు
- కేంద్ర హోంమంత్రి ప్రసంగంపై జిల్లావాసుల్లో నిరాశ
- నల్లబెలూన్లతో సీసీఐ సాధన కమిటీ నిరసన



వేదిక పైనుండి అభివాదం చేస్తున్న అమిత్‌షా, ఇతర బీజేపీ నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగంలో జిల్లా సమస్యలు ప్రస్తావనకు రాలేదు. జాతీయ, రాష్ట్ర సమస్యలపైనే సాగిన ఆయన ప్రసంగం జిల్లాలోని కీలకమైన వాటిపై దృష్టి సారించలేదు. ఎన్నికల సమయం కావడంతో వివిధ సమస్యల పరిష్కారానికి హామీలు లభిస్తాయని ఆశించిన జిల్లావాసులకు నిరాశే ఎదురైంది. సుమారు 45నిమిషాల పాటు సాగిన ఆయన ప్రసంగంలో ఎక్కడా జిల్లా అభివృద్ధిపై మాట్లాడలేదు. గత సమస్యల పరిష్కారంతో పాటు కొత్తగా ఏమైన హామీలు లభిస్తాయా? అని జిల్లా వాసులు ఆశగా ఎదురుచూసినప్పటికీ ఎలాంటి భరోసా దక్కకపోవడం నిరాశకు గురిచేసింది. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో జనగర్జన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరయ్యారు. బీజేపీ అగ్రనేతల్లో ఒకరు కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించే ఆయన జిల్లా పర్యటనకు వస్తుండటంతో ఆ పార్టీ శ్రేణులతో పాటు జిల్లావాసులు సైతం ఆసక్తిగా ఎదురుచూశారు.

వాటికి లభించని హామీలు..!

జిల్లా కేంద్రంలో దశాబ్ద కాలంగా మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని పునరుద్ధరించే అంశంపై ఈ సభలో ప్రస్తావిస్తారని అందరూ భావించారు. గత ఎన్నికల సమయంలోనూ ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన బీజేపీని గెలిపిస్తే సీసీఐని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. కానీ తాజాగా ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోపక్క ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే మార్గం నిర్మాణంలోనూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. కేంద్రం బడ్జెట్ కేటాయించకపోవడం కారణంగా ఈ రైల్వేలైను పురోగతి సాధించడం లేదు. వీటితో పాటు జిల్లా కేంద్రంలో ఇప్పటికే విమానాశ్రయ నిర్మాణానికి అనువైన స్థలం ఉంది. పలుమార్లు వివిధ సర్వే సంస్థలు ఇక్కడ విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా ఉందని నివేదికలు ఇచ్చారు. కానీ కేంద్రం దృష్టి సారించకపోవడం మూలంగా ఈ జిల్లాకు విమానాశ్రయ నిర్మాణం కలగానే మారుతోంది. వీటిపై హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేస్తారని జిల్లావాసులు ఆశించారు. కానీ చివరకు ఆయన నుంచి వీటిపై ఎలాంటి హామీ లభించలేదు.

నల్ల బెలూన్లతో సీసీఐ సాధన కమిటీ నిరసన..!

సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని తెరిపించాలని డిమాండ్ చేస్తూ సీసీఐ సాధన కమిటీ నాయకులు నల్ల బెలూన్ల, కండువాలు ధరించి నిరసన తెలిపారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానం నుంచి డైట్ మైదానానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వస్తున్నారనే విషయం తెలుసుకున్న కమిటీ నాయకులు స్థానిక బాబూజగ్జీవన్‌రాం చౌక్‌లో ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చారు. సీసీఐని తెరిపిస్తామని సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే నాయకులను అడ్డుకొని అరెస్టు చేసి మావల పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు బండి దత్తాత్రి, అరుణ్‌కుమార్, బుట్టి శివకుమార్, వాగ్మారే ప్రశాంత్, స్నుజన్‌జెట్టి, అఖిల్, ఆసిఫ్, సోహెల్, రఘు, కలీం పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీసీఐ సాధన సమితి నాయకులు

తుంగమడుగులో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని తుంగమడుగు గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ విజయ్ శిబిరానికి వచ్చిన 120 పాడిపశువులకు గర్భకోశ, సాధారణ చికిత్సలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ విజయ్ మాట్లాడుతూ పశుసంపద బాగుంటే పాడి పరిశ్రమ బాగుంటుందన్నారు. పశు పోషకులు పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటికి అందించాల్సిన చికిత్సల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శైలేందర్, రాజ్ కుమార్, రమేష్ బాబు, జమీర్, గోపాలమిత్ర రమేష్, పశుపోషకులు పాల్గొన్నారు.



సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

- జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికలు సజావుగా సాగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతీకప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల సెక్టోరల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదని, ఒక సెక్టోరల్ అధికారి పరిధిలో 6 నుండి 9 పోలింగ్ కేంద్రాలు ఉండే అవకాశం ఉందని, పోలింగ్ కేంద్రాలలో వసతులు, ర్యాంపులు, నీటి వసతి, ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో ఏవైన మరమ్మత్తులు ఉన్నట్లయితే వెంటనే పూర్తి చేసి అన్ని వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్లో వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుండి సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సిబ్బందిని తీసుకెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడం, రిజర్వు ఈవీఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ ప్రింటర్ యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో సురేష్‌తో కలిసి మాట్లాడారు. ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ ప్రింటర్ల యజమానులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని తెలిపారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఇతరత్రా ఎన్నికల సంబంధిత సామాగ్రి ప్రచురణ సమయంలో తప్పనిసరిగా ప్రింటర్, పబ్లిషర్, యజమానుల వివరాలతో పాటు మొబైల్ నెంబర్ ముద్రించాలని, డిక్లరేషన్ తీసుకోవాలని తెలిపారు. నమూనా బ్యాలెట్ ముద్రించే సమయంలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారుల అనుమతి తీసుకోవాలని, రాజకీయ పార్టీలు సంబంధిత అనుమతులు పొందిన తర్వాతనే ఎన్నికల ప్రచార పత్రాలు ముద్రించాలని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించరాదని తెలిపారు.

ఎయిడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు పూర్తి అవగాహనతో ఉండి జాగ్రత్త వహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మినరసింహం సూచించారు. మంగళవారం రెడ్ రిబ్బన్ క్లబ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. దీనికి ముందు విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ హరీష్‌రావు, సాయిమహిళా మండలి హెచ్ఐవి ప్రాజెక్టు మేనేజర్ ఈర్ల సునీల్‌కుమార్, జీవన్‌ధార బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి రాజేష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాజు, అధ్యాపకులు జనార్దన్, వెంకటేశం పాల్గొన్నారు.

జనగర్జన సభకు బయల్దేరిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదిలాబాద్‌లో మంగళవారం నిర్వహించిన అమిత్‌షా జనగర్జన సభకు సిర్పూరు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు, ఒక మున్సిపాలిటీ నుండి వంద బస్సులలో వీరు తరలివెళ్లగా కాగజ్‌నగర్‌లో అల్పాహారం అందించారు. స్థానిక పెట్రోల్‌పంపులో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఈ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభారి అరుముళ్ల పోచం, నియోజకవర్గ ప్రభారి రాజమౌళిగౌడ్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములె మల్లయ్య గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ నీరటి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, చప్పిడి సత్యనారాయణ జునుగరి మధూకర్, గణపురం నగేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

పంచాయతీ ట్రాక్టర్ దహనం

నవతెలంగాణ-ముధోల్



మండలంలోని చించాల గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దహనం చేశారని పంచాయతీ కార్యదర్శి అమిత తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. దీంతో సంఘటన స్థలాన్ని మంగళవారం ఉదయం ఎస్సై సాయికిరణ్ పరిశీలించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రెవెన్యూ డివిజన్ కోసం నిరవధిక నిరాహార దీక్ష

నవతెలంగాణ-బోథ్

బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేశారు. 87 రోజులుగా నిరాహర దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటు సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో సాధన సమితి సభ్యులు పసుల చంటి, సల్ల రవి, మాసం అనిల్, మహ్మద్ అభద్, భోజన్న కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ నుంచి తరలిపోయిన కార్యాలయాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యేంతవరకు ఆమరణ నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



సీసీఐ ఫ్లెక్సీలు చించివేయడం హేయమైన చర్య

- సీసీఐ సాధన కమిటీ ఖండన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ కోసం అమిత్‌షా వెంటనే స్పందించాలని సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కొన్ని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే వాటిని చించివేసి, చెత్తకుప్పలో, మురుగు కాలువలో పడవేయటాన్ని సీసీఐ సాధన కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఎంపీగా గెలిపిస్తే సీసీఐ ప్రారంభిస్తామని, ఆనాడు ఎన్నికల బహిరంగ సభలో అమిత్‌షా ప్రకటించారని అన్నారు. ఆనాటి హోమ్‌శాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ కూడా సీసీఐ సందర్శించి, సీసీఐ పరిశ్రమను తొందరలోనే ప్రారంభిస్తామని ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి చెప్పారని గుర్తు చేశారు. కానీ నేటి వరకు సీసీఐ పునః ప్రారంభం కాలేదన్నారు. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ విషయంలో బీజేపీ నాయకుల ద్వంద విధానాలను ప్రజలంతా గమనించాలని అన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేని బీజేపీ నాయకులను సీసీఐ పునరుద్ధరణ విషయంలో రేపటి ఎన్నికల్లో నిలదీయాలని కోరుతున్నామన్నారు. ప్రకటన ఇచ్చిన వారిలో కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ, కమిటీ సభ్యులు ఉన్నారు.

అధిక దిగుబడులపై పత్తి రైతులకు అవగాహన



నవతెలంగాణ-బోథ్

పత్తి పంటలో అధిక దిగుబడిపై మంగళవారం మండలంలోని సొనాల రైతులకు పత్తి పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ కంపెనీ ఎండీఓ నగేష్ సదస్సులో మాట్లాడుతూ నాణ్యత పత్తి గింజలతో అధిక దిగుబడి వస్తుందని, భారత్ సీడ్స్ సూపర్‌కార్డ్ కంపెనీతో అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. దామెర్ల రామ్‌రెడ్డి చేనులో పత్తి పంట ప్రదర్శన నిర్వహించారు. సూపర్ కార్డ్ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలతో ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేష్‌రెడ్డి, గంగారెడ్డి, సోయం బాపురావు, సదానందం, సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఆరోగ్య సమస్యలున్న విద్యార్థులకు మెరుగైన చికిత్సకోసం రిమ్స్‌కు తీసుకెళ్తామని వైద్యులు మనోజ్ కుమార్, రాజమణి సూచించారు. అనంతరం వైద్యులకు కళాశాల ప్రిన్సిపల్ మహేందర్ కుమార్ సిబ్బందితో కలిసి శాలువాతో సన్మానించారు. వైద్యశిబిరంలో ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లె, కళాశాల సిబ్బంది వెంకటరమణ, పి.ఉదయ్ కుమార్ ఉన్నారు.

కేంద్ర మంత్రి కాన్వాయ్ అడ్డగింత.. నాయకులు అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకే తలమానికంగా ఉన్న సీసీఐ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకోబోయారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. నిరసనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం వారిని పోలీసు వాహనంలో ఎక్కించి స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మంగళవారం నల్ల బెలూన్లతో ఫ్లకార్డు పట్టుకొని ప్రదర్శన చేపట్టారు. గత ఎన్నికల సమయంలో జిల్లా పర్యటనకు వచ్చిన అమిత్‌షా సీసీఐను ప్రారంభిస్తామని హామినిచ్చి ఇప్పటీ వరకు ప్రారంభించలేదని సాధన కమిటీ సభ్యులు మండిపడ్డారు.

నేడు అడెల్లి ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధి గాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మెన్ అయిటి చందు, ఆలయ ఈఓ రంగు రవికిషన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో ప్రజా ప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

సమ్మె విరమించిన ఆశాలు.. నేటి నుంచి విధుల్లోకి..



డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు సమ్మె విరమణ నోటీసును అందజేస్తున్న ఆశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటును చేస్తామని హెల్త్ డైరెక్టర్ హామీ ప్రకారం.. సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. బుధవారం నుంచి ఆశాలు విధుల్లోకి వెళ్తారని అన్నారు. అదనపు డీఎంహెచ్‌ఓ సాధనకు మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు నిర్ణిత వేత్తనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యల పరిష్కరించాలని, సెప్టెంబర్ 25 నుంచి సమ్మె చేశామని గుర్తు చేశారు. 18 రోజుల గడిచినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో హైదరాబాద్‌లో వేలాది మందితో ధర్నా నిర్వహించామని తెలిపారు. ఈ ధర్నాతో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వేసిన కమిటీ ఆశాల సమస్యలను కూడా పరిశీలించి, ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీని ఇచ్చారని తెలిపారు. ఈ కమిటీ ఆశాల డిమాండ్స్ అన్నిటిని పరిగణనలోకి తీసుకుంటుందని యూనియన్‌తో ముఖాముఖి చర్చలు కూడా జరుపుతుందని అన్ని అంశాలు తాము అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఆశాల సమస్యలపైన నివేదికను అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు పీఆర్సి, ఎరియార్స్, అలవెన్స్ ఇచ్చే విధంగా చూస్తామని సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామని బిల్లులు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, ఆశలు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



ప్రచారం నిర్వహిస్తున్న అనిల్‌జాదవ్

నవతెలంగాణ-తలమడుగు

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కజ్జర్ల, దేవాపూర్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లోని కాలనీల్లో తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. పది సంవత్సరాల కాలంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తు ప్రభుత్వాన్ని ఆధరించాలని అభ్యర్థించారు. బోథ్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చెందని గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించేలా తన వంతుగా పూర్తి సహకారం అందిస్తూ నిధులు తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, స్థానిక సర్పంచ్ ఫాతిమా అబ్దుల్లా, కేదారేశ్వర్ రెడ్డి, తలమడుగు సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మొట్టె కిరణ్, రైతుబంధు అధ్యక్షుడు జీవన్ రెడ్డి, సునీతరెడ్డి, పల్లవి, శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, గంగాధర్, అభిరాంరెడ్డి, దేవారెడ్డి, జయభారత్‌రెడ్డి, కజ్జర్ల, దేవాపూర్ గ్రామాల, మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండేకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే మాట్లడుతూ ప్రతీ విద్యార్థి చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయం పొందవచ్చని తెలిపారు. చెడు వ్యసనాలు, సెల్ ఫోన్లు వాడటం మంచిది కాదన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, ఆ దిశగా కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థులు కళాశాలకు రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, తాంసి నుంచి భీంపూర్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ రావు డోలే, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోష్, కళాశాల విద్యార్థులు సిబ్బంది ఉన్నారు.

కడెం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మత్తు పనులు చేయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మత్తు పనులు చేసి నీటిని ఒడిసి పట్టి సాగునీరు, తాగునీరుని ఇవ్వాలని, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడెం ప్రాజెక్టు పరిరక్షణ సమితి సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాజెక్టు పై పక్షపాతం చూపిస్తుందని అన్నారు. 15 నంబర్ కౌంటర్ వెయిట్ విరిగి పడి చాలా రోజులు అయిందని అన్నారు. కానీ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో వేల క్యూసెక్కుల సాగునీరు, తాగునీరు వృధాగా గోదావరిలోకి వెళుతుందని అన్నారు. వెంటనే ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ఆయకట్టు కింద ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతంగానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టుని పూర్తిస్తాయిలో కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు షేక్ రఫీక్, ముస్కు రాజు, బబ్లు, యాదగిరి, రహీమ్, రైతులు పెద్ది శ్రీనివాస్, పొద్దుటూరి సంతోష్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, సత్యం, రెడ్డి, సురేష్, నారాయణ, మల్లయ్య, రాజన్న పాల్గొన్నారు.

ప్రారంభమైన మాలీల జెండా పండుగ వారోత్సవాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

మాలీల జెండా పండుగ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే ఆశయ సాధన కోసం 22 ఏండ్ల క్రితం తాంసి మండల కేంద్రంలో జెండాను ఎగురవేసి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఆ ఉద్యమ ఫలితం త్వరలోనే మాలీలకు ఎస్టీ హోదా రూపంలో లభించనుందని తెలిపారు. అప్పటీ వరకు మాలీలంతా ఏకతాటిపై ఉండి పూలే దంపతుల ఆశయ సాధన, ఎస్టీ హోదా కోసం పరితపించాలని కోరారు. పూలే దంపతుల సాహిత్య గ్రంథాన్ని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గణేష్ మహారాజ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గుర్నూలే, మాలీ పటేల్ సంఘం జిల్లా అధ్యక్షులు గంగారాం శిండే, విజయ్, పట్టణ అధ్యక్షులు శ్రీను గుర్నూలే, కార్యవర్గ సభ్యులు దేవిదాస్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటన నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పి.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన పైడిపెల్లి గంగారాం కూతురు పైడిపల్లి అఖిల(20) సోమవారం నుంచి కనిపించడం లేదు. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిందని భావించిన కుటుంబీకులు సాయంత్రానికి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. చరవాణి ద్వారా వారి బంధువులందరికీ సమాచారం అడిగినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆమె అన్న పైడిపెల్లి హరీష్, చెల్లెలు కనబడటం లేదని మంగళవారం నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై తెలిపారు.

గోసంపల్లెలో మద్యం పట్టివేత



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని గోసంపల్లి గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన మద్యాన్ని మంగళవారం సాయంత్రం ఖానాపూర్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వాసనీయ సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో అక్రమంగా నిలువ చేసిన సుమారు 193 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్టు ఎస్సై లింబాద్రి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ, లక్ష వరకు ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని ఎస్సై హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్సైలు మణిరాం, రామచందర్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గంగాధర్, లక్ష్మీనారాయణతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని రేవోజీపేట్ గ్రామంలో యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా మూడోసారి అధ్యక్షులుగా ఏళ్ళలదేవి మహేష్, సభ్యులు గంగన్న, మొండెన, శ్రీను, అయిలయ్య, పెంటయ్య, కుమార్, రాజన్న, మల్లేష్, గట్టు, గడ్డం బాలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏళ్ళల దేవి మహేష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న యాదవ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే యాదవ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

అమిత్‌షాకు ఎమ్మార్పీఎస్ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షాను ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ మంగళవారం కలిశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘంగా పోరాటం చేస్తున్నామని, గతంలో బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కేంద్రమంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేపు గణేష్, ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, రోడ్డ రాజాశేఖర్, గడ్‌చాంద మోహన్, అరేపల్లి సురేష్, కాడదారపు దేవిదాస్, అరేపల్లి గణేష్ పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాకు వచ్చిన బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతనాన్ని చెల్లించే విధంగా బీజేపీ మేనిఫెస్టోలో చేర్చాలని విన్నవించారు. ఈ విషయమై ఈటెల రాజేందర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని రేకులగూడ గ్రామస్తులు జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోటు సుమలత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి మూడేండ్ల జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంపీ రమేష్ మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ అధికారి సాగర్ తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో జరిగిన అత్యాచారం ఘటనలో ఆత్రం చిన్ను అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల విచారణ అనంతరం సాక్ష్యాదారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫోక్సో కేసులో పోలీసులు సాక్ష్యులను ప్రవేశపెట్టారు. అదనపు పీపీ ప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టి నేరాం రుజువు చేయడంతో అదనపు జిల్లా సెషన్స్, ఇన్‌చార్జి ఫోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంపీ రమేష్ నిందితుడికి ఫోక్సో చట్టం కింద నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు



నవతెలంగాణ-రెబ్బెన

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్ అన్నారు. మంగళవారం గోలేటిలో ఏఐఎస్ఎఫ్ ఆసిఫాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం విద్యను వ్యాపారీకరణ చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డు ద్వారా నిర్వహించిన ఉద్యోగాల భర్తీలో భారీగా అవకతవకలు జరిగాయన్నారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రహీం, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి పార్వతి సాయి, మండల అధ్యక్షుడు జాడి సాయి, కార్యదర్శి బాలునాయక్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యాధికారికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌ను కార్యాలయంలో చైతన్య కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్ కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను ఆయనకు వివరించారు. డీఐఈఓ పలు సూచనలు, సలహాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సీజీజీ బృందం పర్యటన

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సెంటర్ ఫర్ గుడ్ గవర్నమెంట్(సీజీజీ) ప్రతినిధులు జానికిరామ్, ప్రోగ్రాం మేనేజర్ దేవీసింగ్, సీనియర్ నాలెడ్జ్ మేనేజర్ పర్యటించారు. మంగళవారం గోలేటిలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంధాలయం, మహిళలు ఏర్పాటుచేసిన పేపర్ మేకింగ్ సెంటర్, ట్రైలరింగ్ సెంటర్‌ను పరిశీలించారు. చోపిడిలోని ఆరోగ్య కేంద్రం విద్యావాలంటీర్ సెంటర్‌లో చిన్నారులతో మాట్లాడారు. గడలపల్లిలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్, సీసీ రోడ్లు, క్రీడా మైదానం, సోలార్ వాటర్‌ప్లాంటును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. గత మూడేండ్లుగా సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం మచ్చగిరి నరేందర్, ఖైరిగూడ ఓసీ పీఓ ఎన్ సత్యనారాయణ, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, పీఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

దేశంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-జన్నారం

దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఎడమ బొజ్జు అన్నారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని పాత పెట్రోల్ పంపు దగ్గర కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్త గ్రామ గ్రామాన వాడవాడకు గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీములను ప్రజలకు తెలపాలన్నారు. ఎన్నికలు 50 రోజులే ఉన్నందున కార్యకర్తలు చురుకుగా పాల్గొని పార్టీని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. నాయకులంతా కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి గుర్రం మోహన్‌రెడ్డి, పసియుల్లా, మత్స్య శంకరయ్య, ప్రభుదాస్ దాముఖ కరుణాకర్, రాజశేఖర్, సుధాకర్ నాయక్, రఫీ ఉల్లా, ముత్యం, రాజన్న పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పి సురేష్ కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కార్యాచరణ విడుదలైన సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖర్చుల పరిశీలకులు, సహాయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ - స్టాటిక్ సర్వేయలెన్స్ బృందాలు, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, అకౌంటింగ్ బృందం, ఎక్సైజ్ బృందం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆయా బృందాలలో శాసనసభ నియోజకవర్గాల వారీగా విభజించబడి విధులు కేటాయించడం జరిగిందని, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత ప్రత్యేక పరిశీలన బృందాలు ఎన్నికల ఖర్చులను పరిశీలించడం జరుగుతుందని, వీడియో సర్వేయలెన్స్ టీం నియోజకవర్గంలో జరిగే ర్యాలీలు, బహిరంగ సభలు, ఎన్నికల సంబంధిత అంశాలను తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయడం జరుగుతుందని, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు, కానుకల పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో 1950, 08733-279411 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై స్పందించాలని తెలిపారు. రూ.50వేల కంటే అధికంగా నగదు తరలించినట్లయితే తనిఖీలలో తగిన ఆధారాలు లేనట్లయితే సీజ్ చేయడం జరుగుతుందని, రూ.10వేల కంటే ఎక్కువ విలువ గల మద్యం తరలించినట్లయితే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. వీడియో సర్వేయలెన్స్ బృందాలు అనుమతి కలిగిన రాజకీయ పార్టీల సమావేశాలను రికార్డు చేయాలని, సమావేశాల సంబంధిత ఖర్చులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వీడియో చిత్రీకరించే సమయంలో వాయిస్, వీడియో సంబంధిత టైటిల్, తేది, ప్రాంతం, వినియోగించే వాహనం, పార్టీ వివరాలు, అభ్యర్థి పేరు పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మద్యం, నగదు, కానుకల పంపిణీ అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతిరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్ బృందాలు, వీడియో సర్వేయలెన్స్, అకౌంటింగ్, ఎక్సైజ్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు, మద్యం సరఫరాపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో డబ్బు మద్యం సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పక్క రాష్ట్రాల నుండి జిల్లాకు డబ్బులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియ దృష్ట్యా జిల్లా పోలీసు శాఖ విధి విధానాలలో భాగంగా ఎక్కడైనా తనిఖీలు చేస్తున్న సమయంలో సహకరించాలని కోరారు. రూ.50వేలకు మించి నగదు ఉంటే ఆ డబ్బుకు సంబంధించిన పూర్తి ఆధారాలు చూపాలని, ఆధారాలు చూపని పక్షంలో ఆ డబ్బును సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. లైసెన్సు కలిగిన ఆయుధాలను(వ్యక్తిగత భద్రత మరియు స్పోర్ట్స్ అండ్ గేమ్స్) జిల్లా సాయుధ కార్యాలయంలో డిపాజిట్ చేయాలని, బ్యాంకు భద్రతకు జారీ చేయబడిన ఆయుధ్ధాలకు మినహాయింపు ఉంటుందన్నారు. ప్రచారం, మీటింగులు, ర్యాలీలకు సంబంధిత డీఎస్పీల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు.

60 రోజుల్లో కమిటీ వేస్తానని 6 నెలలు ఆపడం సరికాదు



నవతెలంగాణ-జైపూర్

మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్, ఓసీ ఈపీ ఆపరేటర్ల సమస్య పరిష్కారానికి 60 రోజుల్లో కమిటి వేస్తామని చెప్పి 6 నెలలు అపడం సరికాదని ఏఐటీయూసీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 7న విడుదల చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా మంగళవారం ఇందారం గని కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అండర్ గ్రౌండ్‌లో పని చేసే మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్, ఓసీలో పని చేసే ఈపీ ఆపరేటర్లు ఏదేని అనారోగ్యం కారణంగా మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో అదేహోదా జాబ్ ఇవ్వాలన్న డిమాండ్ పట్ల యాజమాన్యం కమిటీ వేస్తా అని చెప్పినట్లు ఏఐటీయూసీ నాయకులు నాగభూషణం, విజయ్‌కుమార్, పిట్ కార్యదర్శి చింతల నవీన్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో 2021 నవంబర్ 25న అన్ని కార్మిక సంఘాలు కలిసి ఇచ్చిన సమ్మె నోటీస్ ఫలితంగా కమిటి వేస్తామని చెప్పిన యాజమాన్యం ఇప్పుడు గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావిడిగా ఈ నెల 7న సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని ఆరోపించారు. అంతేకాకుండా యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్ కూడా లోపభూయిష్టంగా ఉందని, ట్రేడ్స్‌మెన్, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులను మోసం చేయడానికి ఇచ్చిన సర్క్యులర్‌గా ఉన్నదని పేర్కొన్నారు. వన్‌టైం మేజర్ కింద ఒక్క సారికి మాత్రమే వీళ్లకు అవకాశం కల్పిస్తామని సర్క్యులర్‌లో పొందుపర్చారని అన్నారు. ఇందులో ట్రేడ్స్‌మెన్స్ గురించి ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదని పేర్కొంటూ ఇది గుర్తింపు సంఘం ఎన్నికల దృష్టితో కార్మికులను మోసం చేయడం కోసం విడుదల చేసిన సర్క్యులర్‌గా భావిస్తున్నామని తెలిపారు. ట్రేడ్స్‌మెన్స్, ఈపీ ఆపరేటర్లకు ఎలాంటి ఉపయోగపడకుండా తీసుకొచ్చిన ఈ సర్క్యులర్ ఏకపక్ష నిర్ణయంగా యాజమాన్యం తీసుకున్నట్లుగా అభిప్రాయపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఇందారం-1ఏ, ఓపెన్‌కాస్ట్ గని కార్మికులతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసిన నాయకులు ఇప్పటికైనా అందరికి ఆమోదయోగ్యమైన సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దే

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి కార్మికుల హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్ సంఘం దేనని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. మందమర్రి ఏరియా వర్క్ షాప్‌లో పిట్ కార్యదర్శి కొండల రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికల సంపత్, రీజియన్ సెక్రెటరీ ఓ రాజశేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనింగ్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్‌లకు మెడికల్ బోర్డు ద్వారా అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో అదే డిజిగ్నేషన్ ఇవ్వడానికి సర్క్యులర్ జారీ చేయించడం జరిగిందని, దీనికి అన్నీ యూనియన్ల మద్దతు ఉందని తెలిపారు. కానీ, ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏఐటీయూసీ సంఘం టీబీజీకేఎస్ యూనియన్‌పై బురదజల్లి, గేట్ మీటింగ్‌లో ట్రేడ్ మెన్లకు అన్యాయం జరిగిందని మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. వాస్తవానికి ట్రేడ్‌మెన్లకు అన్యాయం చేసింది ఏఐటీయూసీ సంఘమే అని అన్నారు. కార్మికులకు ఒక్క రూపాయి ఆర్థిక నష్టం కానీ సమ్మెలు కానీ లేకుండా అనేక రకాల హక్కులు సాధించిన సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అని, రాబోయే ఎన్నికలలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని, బీఆర్ఎస్ పార్టీని గెలిపించి మూడవసారి కేసీఆర్‌ని ముఖ్యమంత్రిని చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి తోట రాజిరెడ్డి, ఇప్ప సమ్మయ్య ఈశ్వర్, గురువయ్య, ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ వెంకటస్వామి, కమిటి సభ్యులు, రాజేశ్వరరావు, పోచయ్య, మల్లేష్, ప్రభాకర్, కిరణ్, రాజయ్య, మధు, కార్యకర్తలు, వర్క్ షాప్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గోలేటి బ్రాంచ్ తక్కళ్లపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పథకాలు, రుణాలు, సామాజిక భద్రత పథకాల గురించి జీవనజ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఇన్సూరెన్స్ వివిధ పథకాల గురించి మ్యాజిక్ షో, పాటల రూపంలో ప్రజలకు అవగాహ కల్పించారు. డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు మేనేజర్ విశ్వప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సలుగు శ్రావన్, క్యాషియర్ సురేష్, బ్రాంచ్ టాప్ ఇమ్రాన్, జనార్ధన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్యాంనాయక్ జన్మదిన వేడుకల్లో బీసీ సంఘం నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీరా శ్యామ్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకల్లో శ్యామ్ నాయక్ పాల్గొనగా ఆయనకు శాలువతో సత్కరించి కేక్‌కట్ చేయించి తినిపిస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, బాలేష్, రైతు అధ్యక్షులు మారుతీ పటేల్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షులు నాగోషే శంకర్ పటేల్, బీసీ యువజన సంఘం నాయకులు ప్రణయ్, డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, బీసీ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయి కృష్ణ, నాయకులు వేములవాడ మహేష్, ఆవిడపు తరుణ్, పసుపునూరి సాయి, సిద్ధూ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కుమరం భీం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు మంగళవారం ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలలో మహిళలకు నెలకు రూ.2500, రైతులకు ఎకరానికి రూ.15 వేలు సంవత్సరానికి, రైతుబంధు, ఏకకాలంలో రూ. రెండు లక్షల రైతు రుణమాఫీ తదితర గ్యారంటీ ప్రజలకు వివరిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మీలో నిబంధనలు ప్రక్కకు పెట్టి స్థానిక ప్రజాప్రతినిధులు అందిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అజ్మీర శ్యామ్‌నాయక్, మండల అధ్యక్షుడు ఎల్.రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, తులసిరామ్, గొడిసెల, వెంకన్న, అశోక్, భీంరావు పాల్గొన్నారు.

భీమిని ఎస్సైగా ప్రశాంత్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-భీమిని

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భీమిలిలో పనిచేస్తున్న ఎస్సై మహేందర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో భూపాలపల్లి జిల్లా నుండి ఎం.ప్రశాంత్ ఇక్కడి వచ్చారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత పోలీసులతో సత్సంబంధాలు కలిగి, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగిన సమాచారం అందించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దృశ్య వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-రామకష్ణాపూర్

పట్టణంలోని 15వ వార్డ్ మల్లికార్జున్‌నగర్‌కు చెందిన రమణమ్మ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ విద్యా సాగర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య అందజేశారు. ఈ సందర్భంగా రమణమ్మ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుమన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డ్ కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, బీఆర్ఎస్ నాయకులు రాజబద్రి, మల్లికార్జున్, శంకరయ్య పాల్గొన్నారు.

బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితాండ(కె), సోమగూడెం(కె), కాసిపేట గ్రామ పంచాయతీలో ఎంపీడీఓ ఎంఏ అలీం పర్యటించారు. ఈ మేరకు గ్రామంలో ప్రాంతాలను పరిశీలించి పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించి తొలగింప చేశారు. దేవాపూర్, కాసిపేట ఎక్స్ రోడ్డులో కూడా తొలిగించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించి పోస్టర్లను, బ్యానర్లను, ఫ్లెక్సీలను తొలగించారు.

పంచాయతీ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని బుగ్గగూడెం గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా విధులు. నిర్వహించిన భీమిని నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి గ్రామ పంచాయతీ నుంచి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ ఏదుల విజయలక్ష్మీ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, కార్యదర్శి సునీత, ఉప సర్పంచ్ భీమిని రఘుపతి, వార్డు సభ్యులు లక్ష్మీ, అక్కవ్వ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మేంద్రపు రాజన్న పాల్గొన్నారు.

తహసీల్దార్ వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ

జన్నారం : జన్నారం మండల నూతన తహసీల్దార్‌గా వేణుగోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నిరోజులు ఇక్కడ పనిచేసిన వనజారెడ్డి నస్పూర్‌కు బదిలీ కావడంతో మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండల తహసీల్దార్‌గా పనిచేసిన వేణుగోపాల్ బదిలీపై మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజలు తోడ్పాటు అందించాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బారాయుడు సూచించారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మహిళా విభాగం వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ప్రతి మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య మహిళ విభాగం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు ఈ విభాగంలో అన్ని రకాల ఉచిత పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భారమవుతున్న పురుగుమందుల ధరలు

- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు
- అప్పుల పాలవుతున్న రైతులు

నవతెలంగాణ-తాండూర్

రైతులకు వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరిగిపోవడంతో రైతులకు సాగు భారం అవుతోంది. ఆరుగాలం పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించకపోవడంతో రైతులు దివాలా తీస్తున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు ఉప్పరి పని (భవన నిర్మాణ రంగం)లో తట్ట పట్టుకొని కూలీలుగా మారుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ పథకాలు రైతుల ధరి చేరటం లేదు. వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులు పెట్టుబడి సాయం, రుణమాఫీ పేరట భూస్వాముల ఖాతాల్లో జమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగంలోని ఉత్పాదకరంగాల వైపు ప్రభుత్వం మొగ్గుచూపుడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. వ్యవసాయ యాంత్రికరణ సబ్సిడీ విత్తనాల సరఫరా, కొత్త వంగడాల సృష్టి వ్యవసాయ పరిశోధన రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించలేకపోతుందన్న వాదనలున్నాయి. తద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోకపోవడం లేదు. రైతుల బతుకులు మెరుగు కనిపించడం లేదు.

20 శాతం పెంరిగిన ధరలు

రైతులు ఆహార వాణిజ్య పంటల్లో వాడే ఎరువులు, పురుగు మందులు విత్తనాల ధరలు అమాంతం పెరిగిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం ప్రభుత్వం పురుగు మందులపై మళ్ళీ 20 శాతం వరకు ధరలు పెంచడంతో రైతులకు దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పత్తి పంటలో వాడే ఇమిడా క్లోపిడ్ ఏసిపెట్ మోనోక్రోటోఫాస్ ప్రిప్రో నిల్ వంటి పురుగు మందుల ధరలు గడ్డి మందుల ధరలు రూ.100 నుండి రూ.200 మేరా అదనంగా పెరిగి పోయాయి. దాంతో రైతులు పెట్టుబడి అమాంతం పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పత్తి పంటలో కలుపుపై పిచికారి చేసే సి పవర్ గత సంవత్సరం కంటే రూ.120 పెరిగిపోయింది. అధిక వర్షాల వల్ల రైతులు పత్తి పంటల అధిక మొత్తంలో కలుపు పురుగుల మందులను వాడాల్సి వచ్చింది. దాంతో రైతుల పెట్టుబడి అమాంతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం పురుగుమందుల కంపెనీలపై నియంత్రణ చర్యలు పెరుగుదలపై విధివిధానాలను సక్రమంగా అమలుపరచకపోవడం వల్ల పురుగుల మందుల ధరలు అమాంతం పెరిగినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.



ఫెర్టిలైజర్ షాపులో పురుగుమందులు

వాణిజ్య పంటలకు తెగుళ్లు

పురుగు మందుల తయారీలో వినియోగించే ముడి సరుకులు దిగుమతి సుఖం రవాణా చార్జీలు పెరగడంతో పురుగుమందుల ధరను పెంచినట్లు పురుగు మందుల కంపెనీలు చెపుతున్నప్పటికీ పురుగుమందుల పెరుగుదల పరిస్థితులన్నీ రైతులను అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నాయి. వాణిజ్య పంటలైన పత్తి, మిరప తోటల్లో అధిక మొత్తంలో తెగుళ్ల పురుగు మందులు వాడాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితుల వల్ల ఈ సంవత్సరంపత్తి పంటలో ఎండు తెగులు దోమపోటుతెల్ల, నల్లి పొగాకు లద్దె పురుగు ఉధృతి ఎక్కువగానే సోకింది. మార్చి మార్చి పురుగు మందులు తెగుళ్ల మందులు పిచికారి చేయడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయి. అధిక వర్షాల వల్ల పంటలో కలుపు ఎక్కువ కావడంతో గడ్డి మందుల వినియోగంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయి. దాంతో రైతులఉత్పత్తి వ్యయం పెరిగిపోయి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పురుగు మందుల కంపెనీలు తాము ఉత్పత్తి చేసిన పురుగుమందుల ధరలపై గుత్తాధిపత్యం ఉండడంతో పురుగు మందుల ధరలను ఎడాపెడా పెంచేస్తున్నారు. ప్రభుత్వం పురుగు మందుల ధరలపై నియంత్రణ లేక లేకపోవడంతో ఫెర్టిలైజర్ షాపులో యజమానులు అందినంత దండుకుంటున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పురుగు మందులపై ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వ విధివిధానాల వల్ల పురుగు మందుల ధరలు పెరిగిపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు. పురుగు మందులు తెగుళ్ల మందులను తయారు చేసే కంపెనీలు ధరలపై పూర్తి గుత్తాధిపత్యం ఉండటంతో ప్రస్తుతం పురుగుమందులపై 18 శాతం జీఎస్టీ వసూలు చేయడంతో పరుగు మందుల పెరుగుదలపై జీఎస్టీ ప్రభావం పడిందని రైతులు అంటున్నారు. జీఎస్టీని ఎరువుల ధరలపై వసూలు చేసినట్టు ఐదు శాతం వరకు కుదించాలని రైతులు కోరుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోయి రైతుల పెట్టుబడి పెనుబారమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పురుగు మందుల ధరలపై నియంత్రణ చర్యలు చేపట్టి పంటల మద్దతు ధర పెంచాలని రైతుల కోరుతున్నారు.

పురుగుమందుల ధరలపై జీఎస్టీ తగ్గించాలి

రామకృష్ణ, రైతు ద్వారకాపూర్



పురుగు మందుల ధరలు పెరగడం వల్ల పెట్టుబడి పెరిగి అప్పుల పాలవుతున్నాము. పురుగు మందులపై ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలి ఎరువుల ధరలపై వసూలు చేసే ఐదు శాతం జీఎస్టీ మాత్రమే పురుగు మందులపై వసూలు చేసినట్లయితే రైతులకు ఊరటగా ఉంటుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల పురుగు మందులు తెగుళ్ళ మందుల వినియోగం పెరిగిపోయింది. పత్తి పంటలో మార్చి మార్చి పురుగుమందులను పిచికారి చేస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర పెంచాలి. ప్రభుత్వం పురుగు మందుల ధరలు నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలి.

పంటలకు మద్దతు ధర పెంచాలి

జైన సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు



ఎరువులు, పురుగు మందులు సాగు ఖర్చు పెరిగి నందున ప్రభుత్వం మద్దతు ధరను పెంచాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు లాభసాటిక లేకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రికరణ, కొత్త వంగడాల సృష్టి, సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వాలు మరిచిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడ్జెట్లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయాలి. ప్రభుత్వాలు రైతు దోపిడి విధానాలను విడనాడి ఎరువులు పురుగుమందుల పై సబ్సిడీలను పెంచాలి. రైతులకు సాగు ఉత్పత్తి అవసరాలపై జీఎస్టీని ఎత్తివేయాలి.

సేవా సమితి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్ 3 నెలల శిక్షణ తరగతులను ఏరియాలోని ఎల్లందు క్లబ్‌లో అక్టోబర్ 13న ఉదయం 10.00 గంటలకు ప్రారంభిస్తున్నామని ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యామ్ సుందర్ తెలిపారు. కోర్సులకు దరఖాస్తు చేసుకోవలసిన వారు సింగరేణి కార్మికుల పిల్లలు, కార్మికుల భార్యలు, మాజీ కార్మికుల పిల్లలు వారి భార్యలు, భూ నిర్వాసితులు, ఏరియాలోని కేకే ఓసీపీ ప్రాజెక్టు, ఆర్కే ఓసిపి ప్రాజెక్ట్ రామకృష్ణాపూర్, శ్రావణ్ పల్లి ఓసీపీ ప్రాజెక్ట్, చుట్టుప్రక్కల గ్రామాల మహిళలు శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 15న దారఖాస్తుల స్వీకరణకు చివరి గడువని తెలిపారు. పూర్తి వివరాలకు 7013359316, 9703279787 నెంబర్లను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, తండ్రి/భర్త యొక్క సింగరేణి జీతం చిట్టీ, లేదా గుర్తింపు కార్డు, ఒక ఫోటోని దరఖాస్తుకు జత చేయాలన్నారు.

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ మండలం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మేకల మాణిక్యంని మంగళవారం పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలు అంతా కలిసికట్టుగా ఐకమత్యంతో పనిచేసి పార్టీని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదం రాకేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్ సుభాష్‌రెడ్డి, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ పంకజ నోముల రాజకుమార్, రాయమల్లు గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాసిం పటేల్, రియాసత్ అలీ, నక్రు నాయక్, తాటికొండ శ్రీనివాస్, మహమ్మద్ అజార్, బండారి స్వామి, బోట్ల భాగ్య రావు, యాట రమేష్, షాకీర్, దస్తగిరి, బెడద సత్తయ్య, బోడ బన్సీలాల్, నసీం పాల్గొన్నారు.

మిగులు భూములైనా దక్కనివ్వరా..?

- సింగరేణి యాజమాన్యం కుట్రను వ్యతిరేకిస్తున్నాం
- రామారావుపేట్ గ్రామస్తులు

నవతెలంగాణ-జైపూర్

ఇప్పటికే వెయ్యి ఎకరాలకు మించిన వ్యవసాయ భూములు సమకూర్చిన మా పట్ల కనీస కనికరం లేకుండా మిగిలివున్న భూములైనా మాకు దక్కనివ్వని పరిస్థితి ఎదురవుతుందని రామారావుపేట్ గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీరాంపూర్, ఇందారం ఓపన్‌కాస్ట్ గనుల ఏర్పాటు రామారావుపేట్ గ్రామ పంచాయతికి శాపంగా మారిందని వాపోయారు. సింగరేణి యాజమాన్యం అవసరాలకు భూములు సేకరిస్తున్న తీరును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. శ్రీరాంపూర్, ఇందారం ఓపన్ కాస్ట్ గని విస్తరణకు ఇప్పటికే వందల ఎకరాలుసమకూర్చగా ప్రస్తుతం ఓవర్ బర్డెన్ తొలగింపు కోసం మిగిలిన మా భూములను కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. గతంలో తీసుకున్న భూములు కాకుండా ఇప్పుడు మరో 129 ఎకరాల భూమిని తీసుకునే ప్రయత్నంలో తమ ప్రమేయం లేకుండానే భూములు తీసుకునేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం చేస్తున్న కుట్రను పసిగట్టి గతంలో కలెక్టర్‌ను కలిసి స్థానిక స్థితిగతులు వివరించడం జరిగిందని అన్నారు. సింగరేణి అవసరాలకు సమకూర్చిన భూములు పోను మిగిలి ఉన్న భూములను తీసుకుని మాకు ఎలాంటి ఆధారం లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించడం జరిగిందని తెలిపారు. రామారావుపేట్ శివారులో మాకు తెలియకుండా మా భూములల్లో రెవెన్యూ అధికారులతో కలిసి సింగరేణి అధికారులు సర్వేలు చేస్తున్న తీరు బాధాకరమని పేర్కొన్నారు. ఇదే విషయమై గతంలో సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకోవడంతో పాటు ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇవ్వమని తేల్చి చెప్పినట్లు తెలిపారు. అయినప్పటికీ మా భూముల్లో సర్వే చేస్తూ జబర్దస్తీగా భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న తీరు అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా వద్దు మొర్రో అని మొత్తుకున్నా వినకుండా మా భూములను మాకు కాకుండా చేశారని వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో కొంతం మధూకర్, జిట్ట తిరుమల్, పూదరి వెంకటమ్మ, గడ్డం రమేష్, గడ్డం సధ్యశ్రీ, పెల్లేర్ల సదానందం, ఆకుల రమేష్, పూదరి వెంకటేష్, నామాల తిరుపతి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రామారావుపేట్ గ్రామస్తులు

మా ఊరి భూమిని కబ్జా చేస్తున్నారు

- మంత్రి కొప్పుల ఈశ్వర్ అనుచరులమంటూ బెదిరింపులు
- ఆందోళనలో నంనూర్ గ్రామస్తులు



నవతెలంగాణ-మంచిర్యాల

హజీపూర్ మండలంలోని నంనూర్ అర్ అండ్ కాలనీ మార్కెట్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలంలో కొందరు కబ్జా దారులు కన్ను వేసి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. మంగళవారం ఆక్రమణ దారులు ఆ స్థలాన్ని చదును చేస్తున్న క్రమంలో గ్రామస్థులు అడ్డుకున్నారు. పోలీస్‌లు వచ్చి ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన నంనూర్ గ్రామానికి అర్‌అండ్‌అర్ కాలనికి గుడిపేట్ శివారు 300 సర్వే నంబర్‌లో కాలనీ కోసం కేటాయించారు. దానికి నేషనల్ హైవే 63ను ఆనుకొని సుమారు 3 ఎకరాల స్థలం మార్కెట్, షాపింగ్ కంపెల్స్ కోసం కేటాయించారు. అప్పటి ఆర్డీఓ నర్సింగరావు ఆధ్వర్యంలో దీనికోసం మ్యాప్ కూడా వేశారు. స్థలాన్ని సూచించారు కూడా. అయితే రెవిన్యూ ఆఫీస్‌ల చుట్టూ తిరిగే రియల్ వ్యాపారి రెవెన్యూ లోపాలను ఆసరాగా చేసుకొని చింతం గోధాజీ అనే వ్యక్తి మేము మంత్రి కొప్పుల ఈశ్వర్ మనుషులం , ఆ భూమి తనదే అంటూ ఓ ప్రయివేట్ సర్వేయర్ తోటి మ్యాప్ వేయించుకొని ఆ స్థలం తనదే అంటూ కోర్టు నుంచి ఆర్డర్స్ తీసుకొని మొఖాపైకి వచ్చి బెదిరిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. కాగా ఈ స్థలం మా కాలనీకి సంబందించి కబ్జాకు ప్రయత్నం చేస్తున్న వారి స్థలం బెటాలియన్ వెనుకాల వస్తుందని గ్రామస్థులు అంటున్నారు. అయితే అర్ అండ్ అర్ కాలనికి మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని అధికారులు కబ్జా కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీజేపీ జన గర్జనకు వెళ్లిన మండల నాయకులు

జన్నారం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీజేపీ జన గర్జనకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్, రోటి గూడ, కవ్వాల్, బంగారు తండాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు, వాహనాలలో ఆదిలాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మండల అధ్యక్షులు గోలి చందు, బీజేపీ జిల్లా నాయకులు కొంతం శంకరయ్య మధుసూదన్ రావు తిమ్మాపురం ఎంపీటీసీ వెంకటస్వామి, యుగంధర్, శ్రీనివాస్, మల్లికార్జున్ తరలి వెళ్లారు.

వాహన తనిఖీల్లో రూ.2లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ చేయగా, ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.రెండు లక్షల నగదు లభించిందని ఎస్సై పి.సతీష్ పేర్కొన్నారు. కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొప్పుల భూపతి, జన్నారం పట్టణానికి చెందిన శ్రీరాముల కృష్ణకాంత్‌ల వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.రెండు లక్షల వారి వద్ద ఉండటంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకొని, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారి ఉత్తర్వుల మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే దానికి లెక్క చెప్పాల్సి ఉంటుందన్నారు. వ్యాపారస్తులు, రైతులు, వేరే బిజినెస్ చేసేవారు డబ్బులు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన బిల్లులను ఉంచుకోవాలన్నరు. పోలీస్ శాఖ అధికారులు రూ.50 వేలకుపైగా డబ్బులు తీసుకెళ్తున్న వారిని పట్టుకోవడం జరుగుతుందన్నరు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు..

ఎఫ్ఆర్ఎస్ యాప్‌పై పాధ్యాయులు అవగాహన పెంచుకోవాలి

- ఎంఈఓ వాసాల ప్రభాకర్



నవతెలంగాణ-కాసిపేట

విద్యార్థుల హాజరు శాతం, మద్యాహ్న భోజనం వివరాలు ఇక నుంచి ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా నిర్వహించాల్సి ఉంటుందని, ఆ యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ వాసాల ప్రభాకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో యూడైస్ ప్లస్, డీఎస్ఈ ఎస్ఆర్పీ యాప్ పై మండల స్థాయి అవగాహన సమావేశాన్ని ఎంఈఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల వివరాల నమోదుకు సంబంధించి యూడైస్ ప్లస్ ఆన్‌లైన్ విధానంపై, విద్యార్థుల హాజరు నమోదు. మద్యాహ్న భోజన వివరాల నమోదుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఎటువంటి అనుమానాలున్నా నివృత్తి చేసుకొని, ఆన్‌లైన్ విధానంపై అవగాహన పెంచుకొని వివరాలను యాప్ ద్వారా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లంబాడితాండ(ఎస్) హై స్కూల్ హెచ్ఎం నెన్నెల లచ్చయ్య ప్రైమరీ పాఠశాలల హెచ్ఎంలు, సీసీఓ రాంబాబు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సౌజన్య, సీఆర్పీలు తిరుపతి, వకులాదేవి. ఐఆర్పీ శ్రీలత పాల్గొన్నారు.

ఘనంగా వెంగళ్‌రావు 68వ జయంతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లిలో మాజీ ఓసీసీ ప్రెసిడెంట్, సీనియర్ నేత పూస్కూరి వెంగల్ రావు జయంతిని ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ముత్యంపల్లిలోని బైపాస్ చౌరస్తాలో వెంగల్ రావు విగ్రహానికి జడ్పీటీసీ పల్లె చంద్రయ్య వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, వెంగల్ రావు కుమార్తె ఆరుంధతిలు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం 50 మంది వృద్ధ మహిళలకు చీరలను, పండ్లను పంపిణీ చేశారు. దేవాపూర్ ఓరియంట్ గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా, మండల, జిల్లాలో పలు పదవుల్లో కాసిపేట మండలంలో ప్రజలకు ఎన్నో సేవలు అందించారని ప్రజాప్రతినిధులు, నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడె బాదు, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, ఉప సర్పంచులు బోయిని తిరుపతి యాదవ్, పిట్టల సుమన్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, గ్రామ అధ్యక్షుడు మద్దివేణి వేణు, ప్రశాంత్, గంగాదరి రాజేశం, ఇంతియాజ్, బోయిని సందీప్, కరీంలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఏసీపీ తనిఖీలు



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో రాపనపల్లి వద్ద ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సురేష్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మోహన్ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున అధిక నగదు ఎవరు తీసుకురావద్దని అన్నారు. నగదు తీసుకొస్తే సరైన పత్రాలు సమర్పించాలని అన్నారు. సరిహద్దు దాటి మద్యం గాని గుట్కా నిషేధిత వస్తువులు రావణ చేసిన చట్టపరంగా శిక్ష అనుభవిస్తారని అన్నారు నిరంతరం పోలీసుల పర్యవేక్షణలో ఈ చెక్ పోస్ట్ ఉంటుందని అన్నారు.

5

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

తాత్కాలిక వంతెన పూర్తి రాకపోకలకు సుగమం

నవతెలంగాణ-జైనథ్



ఇటీవల ఫిబ్రవరి నెలలో మండలంలోని తరోడ వంతెన కుంగిపోయింది. విషయాన్ని తెలుసుకున్న అధికారులు వెంటనే తాత్కాలిక రోడ్డును నిర్మించారు. కొన్ని నెలల రోజుల తర్వాత అధిక వర్షాలు కురవడంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. మళ్లీ వర్షాలు తగ్గడంతో ఈ రెండు రోజులు రవాణా సౌకర్యాల కొరకై తాత్కాలిక వంతెనకు మరమ్మత్తులు చేసి రాకపోకలకు సుగమం చేశారు.

మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌ను కలిసిన సాయిని ప్రసాద్ నేత

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఉప్పల వెంకటేష్ గుప్తాను టీఎస్ఎంవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత కలిశారు. మంగళవారం హైదరాబాదులో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ కలిసి అభినందించారు. నిరుపేదలకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకటేష్ గుప్తా సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని సాయిని ప్రసాద్ నేత ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన సీఐ



నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో ఈనెల 15 నుంచి 23 వరకు నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి, ఎస్సై గణేష్, ఆలయ ఈఓ విజయరామారావు ఆలయంలో ఉత్సవాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మూలా నక్షత్రం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా అక్షరాభ్యాస పూజలు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులను గౌరవించాలి



- డీఎస్పీ గంగారెడ్డి

నవతెలంగాణ-దస్తురాబాద్

ఫిర్యాదుదారులను పోలీసులు గౌరవించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సందర్శించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి వాహనాన్ని జాగ్రత్తగా పరిశీలించి, రూ.50వేల కన్నా ఎక్కువగా తీసుకెళ్తున్న వారి డబ్బును ఆధారాలు లేకుంటే సీజ్ చేయాల్సిందిగా తెలిపారు. రోడ్డు నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించనున్న పోలీస్ స్టేషన్ భవన స్థలాన్ని, నూతనంగా నిర్మించనున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై ప్రభాకర్ రెడ్డి, ఎస్సై రాజు సిబ్బంది ఉన్నారు.

సివిల్ కాంట్రాక్టర్లకు మంత్రి భరోసా

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి సంస్థ సివిల్ కాంట్రాక్టర్లకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ భరోసా కల్పించారు. సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్-2023 ఉత్తర్వులో ఇబ్బందికర అంశాలు ఉన్నాయని, పాత పద్ధతిలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సంస్థవ్యాప్తంగా 11 ఏరియాలకు చెందిన సివిల్ కాంట్రాక్టర్లు సోమవారం రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన మంత్రి ఈశ్వర్ వెంటనే సింగరేణి సంస్థ డైరెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి పాత పద్ధతినే కొనసాగించాలని సూచించగా, అందుకు డైరెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి పాత పద్ధతిని అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుక మొండయ్య తెలిపారు. తమ సమస్యను విన్నవించిన వెంటనే పరిష్కరించిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీటీ స్వామి, 11 ఏరియాలకు చెందిన సివిల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మెరుగైన ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే శ్రీనివాస్

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ: బొగ్గు ఉత్పత్తి సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణతో కలిసి ఓసీపీ-3 ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఓసీపీ-3 వ్యూ పాయింట్ నుంచి సర్వే మ్యాప్ ద్వారా పని స్థలాలను పరిశీలించారు. అనంతరం గనికి కేటాయించిన లక్ష్యాలు, అందుకు చేపట్టవల్సిన ప్రణాళికలు తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. వారి వెంట ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, ఓసీపీ-3 ప్రాజెక్ట్ మేనేజర్ డి.రమేష్, సర్వే అధికారి నరసింగరావు, చంద్రమౌళి, డ్రాగ్‌లైన్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ ఉన్నారు.

హక్కుల కోసం పోరాడే వారికి అవకాశం ఇవ్వాలి

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ: కార్మికుల హక్కుల కోసం పోరాడే వారికి ఈ యూనియన్ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని ఎస్సీఈయూ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి కోరారు. మంగళవారం ఓసీపీ-3 కృషి భవన్‌లో ఆర్జీ-2 ఏరియా అధ్యక్షుడు కుంట ప్రవీణ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికులు సింగరేణిలో దాదాపు 30 సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవీవిరమణ అనంతరం వారి డబ్బులు కనీసం ఇంటి స్థలం కొనుగోలుకు కూడా సరిపోవట్లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 ఏరియా ఉపాధ్యక్షుడు రాంసాగర్, వెంకన్న, మంద భూమయ్య, వెంకట నర్సయ్య, కోశాధికారి వెంకటేశ్వర్లు లక్ష్మీరాజం, శ్రీహరి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారులు అరెస్టు

నవతెలంగాణ-మంథని: నాటు సారాను తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం పెద్దపల్లి ఎక్సైజ్ సీఐ గురవయ్య ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. నాటు సారాను తయారు చేసి చుట్టుపక్కల గ్రామాలకు ద్విచక్రవాహనంపై సరఫరా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు మంథని ఎక్సైజ్ సీఐ గురవ య్య ఆధ్వర్యంలో కాటారం నుంచి మంథనికి వెళ్ళే నాగేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద గస్తీ నిర్వహించి 10 లీటర్ల నాటుసారాయితో పాటు ద్విచక్ర స్వాధీనం చేసుకున్నారు. అడ్వాలపల్లి (రచ్చపల్లి) గ్రామానికి చెందిన బానోత్ మోహన్‌నాయక్, బానోత్ దేవి అనే ఇద్దరు వ్యక్తులపై కేసును నమోదు చేసి తహసీల్దార్ ఎదుట ముందు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.గురవయ్య తెలిపారు.

ఎన్నికల నియమాలను పాటించాలి



- కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు.. కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈవీఎంలో నూతనంగా పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి ఫోటో ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఓటు హక్కుపై కళాజాతలు, గ్రామసభలు, ర్యాలీలు, కళాశాలల్లో అవగాహనాలు కల్పించామన్నారు. జిల్లాలో మొత్తం 992 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 771 పోలింగ్ కేంద్రాలు జిల్లా పరిధికి వస్తాయన్నారు. నవంబర్10 నుండి నామినేషన్లు దాఖలు చేయడం జరుగుతుందన్నారు. 13న పరిశీలన, 15న విత్ డ్రా, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1950 లేదా 939874927 అందుబాటులో ఉంచామన్నారు. రూ.50 వేలకుపైగా నగదు దొరికితే తగిన సాక్ష్యాలు ఉంటే విడిచిపెడతామని లేని పక్షంలో జప్తు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ జన్నారం

తహసీల్దార్‌గా విధులు నిర్వహించి నస్పూర్‌కు బదిలీపై వెళ్లిన వనజారెడ్డిని మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పూలమాలలతో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్ మాట్లాడుతూ మూడు నెలల సమయంలోనే తహసీల్దార్ ప్రజల మన్ననలు పొంది ఎంతో అభిమానాన్ని చురగొన్నారన్నారు. ఆమె సేవలు మరిచిపోలేనివని అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి అన్నారు. మంగళవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలని అన్నారు. జీవితంలో మంచి స్థానంలో ఉండాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. చెడు మార్గంలో వెళ్లవద్దని, మంచి మార్గంలో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక నృత్యాలు చేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పూర్వ డిగ్రీ తిరుమన్ ఇటీవల కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపిక కావడంతో ఆయనతో పాటు, ప్రస్తుత తృతీయ సంవత్సర విద్యార్థి వకీల్‌ను ప్రిన్సిపాల్ స్వామి, అధ్యాపకులు డాక్టర్ సంగీత, డాక్టర్ శ్రావణి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, శంకర్, శ్రీనివాస్, రాజ్ కుమార్, జావిద్, దేవన్న, శ్వేతా, స్వప్న, యోగలక్ష్మీ, నవీన్, కార్తీక్, నారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక రోగులకువైద్యం అందించే బాధ్యత ప్రభుత్వాలదే



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మానసిక రోగులకు వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వాలదేనని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది మోతె రాజలింగు అన్నారు. మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మూఢనమ్మకాలు, మూఢాచారాలు, లాంటి వాటిపై ప్రజల్లో ఉన్న అపోహలను ప్రభుత్వాలు తొలగించాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో ఉన్న మానసిక రోగులకు సరైన చికిత్సను అందించే బాధ్యత ప్రభుత్వాలదేనని, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైట్ టు హెల్త్ ఫోరం పట్టణ అధ్యక్షుడు పోతుల మురళీకృష్ణ, సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

నవతెలంగాణ-మంథని

మంథని మండలంలోని నెల్లిపల్లి గ్రామానికి చెందిన కటుకు అశోక్ (35) సంగీత(28) అనే దంపతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. మల్హర్ మండలం తాడిచెర్లకు చెందిన సంగీతతో అశోక్‌కు ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరి కూతురు, కొడుకు ఉన్నారు. అశోక్-సంగీతలు కూలి పని చేసుకుంటూ కౌలుకు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కౌలుకు రెండు ఎకరాల పత్తి, మూడు ఎకరాల వరి వేయడంతో ఇటీవల వచ్చిన వరదలతో ముంపునకు గురైంది. పంట నష్టం వాటిల్లడంతో మనస్థాపానికి గురై అశోక్-సంగీతలు సోమవారం రాత్రి పురుగుల మందు తాగారు. సంగీత తండ్రి అంబీరు రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు మృతిచెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలు అయ్యారు.

కురుమ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జూలపల్లి

మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో మంగళ వారం కురుమ సంఘం గ్రామ కమిటీని నియమించారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా జంగం రాజుమల్లు, ఉపాధ్యక్షుడిగా కంబల్ల చిన్న లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా కచ్చు చిన్న మహంకాళి, కచ్చు శంకర్, సలహాదారుడు పెద్ది సతీష్, కార్యవర్గ సభ్యుడు కంబల్ల కవిత, జంగం కనకమ్మ, భూమల నరేష్, బైర తిరు పతి, ఓరుగల స్వామి, నరేష్, భూమల ఐలయ్య, నిట్టు రమేష్, కంబాల భూమ య్య, అమరగొండ ఐలయ్య, భూమల పోషాలు, శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎమ్మెల్యే

నవతెలంగాణ-మంథని: కౌలు రైతు దంపతుల ఆత్మహత్య బాధాక రమని, వారి కుటంబాన్ని ప్రభుత్వం తక్షణ మే ఆదుకోవాలని మంత్రి ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. మంథని మండలం నెల్లిపల్లి గ్రామంలో ఆత్మహత్య పాల్పడ్డ దంపతుల కుటుంబాన్ని శ్రీధర్ బాబు పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూని యర్ కళాశాలను పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా ధికారి కల్పన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యా ర్థులతో మాట్లాడుతూ కళా శాల రెగ్యూలర్‌గా రావాలని సూచించారు. అన్ని సదుపా యాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. పరిశుభ్రమైన నీటిని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అధ్యాపకులతో వారి సెలబస్, విద్యార్థుల శ్రద్ధ విషయాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె.లాయఖ్ అలీ, అధ్యాపక బృందం ఉన్నారు.

నిరుపేద చిన్నారులకు ప్యాకెట్ మనీ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: సీనియర్ లయన్, వ్యాపార వేత్త గుగ్గిళ్ళ రవీంద్రచారి ఉమాదేవి కూతురు శృతి పుట్టిన రోజు సంద ర్భంగా రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జ్యోతి గాంధీ ఫౌండేషన్ నిర్వహణలో గుగ్గిళ్ళ రవీంద్రచారి నేతత్వంలో గోదావరి ఖని కాకతీ యనగర్ అంగన్‌వాడీ బడిలోని నిరుపేద కుటుంబాల చిన్నారులకు ప్యాకెట్ మనీని రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయ లక్ష్మి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అనంతరం పిల్లల మధ్య బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. ఫౌండేషన్ కార్యనిర్వాహకుడు దయానంద్ గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ సంఘ బాధ్యులు స్వర్ణ లత, శారద, తిరుమల, పద్మ తదితరులున్నారు.

మండల కాంగ్రెస్ యువ నాయకుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు

మండల కాంగ్రెస్ యువ నాయకుడైన పాఠశాల చైర్మెన్ ఎడుమేకల వెంకన్న సోమవారం రాత్రి మృతి చెందారు. కుచులాపూర్ గ్రామానికి చెందిన వెంకన్న మండల వాసులతో పాటు ఇతర పార్టీ నాయకులు, ప్రజలతో కలిసిమెలిసి ఉండేవారు. సోమవారం ఉదయం హై బీపీ ఉండటంతో వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో వైద్యం అందించినప్పటికీ కోమాలోకి వెళ్లి అదే రోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఓ మంచి నాయకున్ని కోల్పోయినట్లు కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీల నాయకులు చర్చించుకోవడం జరిగింది.

భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా...

కుచులాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వెంకన్న యాదవ్ భౌతికకాయంపై జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వామన్, కొత్తూరు సర్పంచ్ గంగారాం, సల్ల దేవన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రసవత్తరంగా మంథని ఎన్నికల పోరు

- ముగ్గురు అగ్రవర్ణాలు, ఇద్దరు బీసీ వర్గాల మధ్య పంచముఖ పోటీ
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రజలు



నవతెలంగాణ-మంథని: మంథని ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో పంచముఖ పోటీ నెలకొంది. మంథని అసెంబ్లీ స్థానం లో 1952 నుంచి 2004 వరకు కాంగ్రెస్ పార్టీ అధిపత్యం కొనసాగించగా ఒక సారి 1994లో టీడీపీ, 2014లో బీఆర్ఎస్ నియోజకవర్గ పగ్గాలు చేపట్టింది. 2014 నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షపాత్ర పోషిస్తూ స్తబ్దగా ఉండిపోయింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం పుంజుకుంది. ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. కొత్తగా వచ్చిన బీజేపీ అభ్యర్థి తమ ఉనికి చాటుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. బీఎస్పీ నుంచి కూడా పోటీ చేస్తామని ఆ నాయకులు ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా మంథని నియోజ కవర్గంలో ఇక రాజకీయాలు వాడివేడిగా సాగనున్నాయి. మంథని నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, జన సేన పార్టీ అభ్యర్థిగా మాయ రమేష్ బరిలో నిలువనున్నారు. మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పర్యాటనలు చేస్తు న్నా కాంగ్రెస్ కార్యకర్తలు ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ఈ మధ్యనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ప్రజాఆశీర్వాద యాత్ర చేపట్టి నియోజకవర్గంలోని 300 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌బాబు మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నారు. సునీల్‌రెడ్డి బీజేపీ తరపున బరిలో నిలబడ నున్నారు. ముగ్గురు అభ్యర్థులు అగ్రవర్ణాలు కాగా మరో ఇద్దరు బీసీ సామాజిక వర్గాలకు చెందినవారు. సుమారు బీసీల ఓట్లు అధికంగా ఉండడంతో ఓట్ల చీలిక ఎవరికి లభిస్తుందా అన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2014లో శ్రీధర్‌బాబు ఓడిపోగా పుట్ట మధుకర్ గెలిచారు. 2018లో శ్రీధర్‌బాబు మళ్లీ గెలవగా పుట్ట మధుకర్ ఓడిపోయారు. మధు జడ్పీ చైర్మన్‌గా, శ్రీధర్‌బాబు ఎమ్మెల్యేగా కొన సాగుతూ ఒకరికొకరు పోటాపోటీగా పనులు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి సునీల్ రెడ్డి నియోజకవర్గంలో తిరుగుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి కొంత మందిని పార్టీలోకి చేర్చుకుంటూ పార్టీని బలోపేతం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు వేర్వేరు సామాజిక వర్గానికి చెందినవారు కావ డంతో ఇరువురు మధ్య బీసీ ఓట్లపైనే దృష్టి పెట్టి ఎవరికి వారు దీమాతో ఉన్నారు. ఏది ఏమైనా మంథని నియోజకవర్గంలో మూడు పార్టీల మధ్యనే పోటీ నెలకొంది.

• అనుకూల ప్రతికూల పరిస్థితులు

- ఎమ్మెల్యేగా, ఏఐసీసీ కార్యదర్శిగా కొనసాగుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడం, ప్రజల్లో వ్యక్తిగతంగా మంచి పేరు ఉండడం, ఎన్నికల్లో ఆయనకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి.
- బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధుకర్ ఎంపీపీ, జడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పదవుల్లో ఉండి ప్రజలకు సేవలు అందిస్తూ పట్టు సంపాధించుకున్నారు. బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మధుకు అన్ని వర్గాలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. మున్నూరు కాపు వర్గానికి చెందిన వ్యక్తి కావడం అనుకూల అంశం. పార్టీలో నాయకత్వం వహిస్తూ ఆయనే ఏకైక నాయకుడు కావడం, ద్వితీయ శ్రేణి నాయకులు లేకపోవడం ప్రతికూల అంశం.
- బీజేపీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి విద్యమంతుడు కావడం, తండ్రి మాజీ ఎమ్మెల్యే రామ్‌రెడ్డి పేరుతో ఆయనకు ప్రతికూల అంశం. సునీల్‌రెడ్డి కొన్ని సంవత్సరాల క్రితం అమెరికా నుంచి మంథనికి వచ్చి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బీజేపీలో గ్రూపు తగాదాలు లేకుండా అనుకూలంగా ఉన్నాయి.
- టీడీపీ అభ్యర్థి మాదాడి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు క్రియాశీలకంగా పనిచేస్తూ నియోజకవర్గంలో సుపరిచితులు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తల మన్ననలు పొందుతూ నాయకులతో సమన్యాయంగా ఉండడం అనుకూల అంశం.
- జనసేన అభ్యర్థి మాయ రమేష్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ అభివృద్ధికి పనిచేస్తూ కార్యకర్తలను తయారు చేసుకుంటూ ప్రజల్లో మన్ననలు పొందే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలో జనసేనపార్టీ కొత్తగా రావడం ప్రతికూల అంశం.

చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- ఎండుతున్న పంటలు • లబోదిబోమంటున్నరైతులు • పట్టించుకోని అధికారులు



పంటలను చూపిస్తున్నరైతులు

నవతెలంగాణ-ముత్తారం: ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి ముత్తారం మండలం మైదంబండ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వారం శివారులో గల ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. దీంతో పదిహేను రోజుల నుంచి పంటలు ఎండుతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించడం లేదంటూ రైతులు గుజ్జుల రవీందర్‌రెడ్డి, జంగ వెంకటరెడ్డి, అబ్బు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి



నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ: పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ మారెల్లి రాజిరెడ్డి నియామకమైనట్లు కాంగ్రెస్ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మాక్కన్ సింగ్‌కు రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీగా ఎండీ రహీం



నవతెలంగాణ-గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా సెక్రెటరీగా మల్కాపురం గ్రామానికి చెందిన రహీం నియ మిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్‌రావుకి నియమించిన జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.